# పార్కులకు మహనీయుల పేర్లు..

- నిరుపయోగ స్థలాలు పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి
- తొమ్మిదేండ్లలో ఆదర్శవంతంగా అభివృద్ధి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కేపీహెచ్‌బీ కాలనీలో అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 8 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలను పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేసి.. ఆ పార్కులకు మహనీయుల పేర్లను పెట్టడం జరిగిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీనగర్ డివిజన్లలో రూ.5.5 కోట్లతో అభివృద్ధి చేసిన పార్కులను, ఓపెన్ జిమ్‌లతో పాటు పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, శిరీషాబాబూరావు లతో కలిసి ప్రారంభించారు. బాలాజీనగర్ డివిజన్‌లోని హబీబ్‌నగర్ ముస్లిం గ్రేవియార్డులో వెయిటింగ్ హాల్‌ను, కేపీహెచ్‌బీ కాలనీ 1వ రోడ్డులో సరోజినీనాయుడు ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ పార్కు, భగత్‌సింగ్ పార్కు, రోడ్డు నం.2లో ధనలక్ష్మి ప్లే గ్రౌండ్‌లను ప్రారంభించారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లో కాలనీ 7వ ఫేజ్ క్రిస్టియన్ గ్రేవ్‌యార్డులో వెయిటింగ్ రూమ్, ఎనర్జీ థీమ్ పార్కును, విశ్వంభర కాలనీలో వాటర్ ట్యాంక్ పార్కులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలన్నింటినీ పరిష్కరించి ఆదర్శవంతంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గత పాలకుల హయాంలో పరిష్కారంకాని సమస్యలను తొమ్మిదేండ్లలోనే పరిష్కరించానని.. కాలనీలు, బస్తీలలో చేసిన పనులు ప్రజలకు కండ్లముందే కనబడుతున్నాయని తెలిపారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ప్రణాళికాబద్ధంగా పనులు చేసి భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా పరిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో 90శాతం పనులు పూర్తయ్యాయని.. ఇటీవల చేపట్టిన పాదయాత్రలో గుర్తించి సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

**పార్కులకు మహనీయుల పేర్లు..**

కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీనగర్ డివిజన్లలో జీహెచ్‌ఎంసీ స్థలాలు నిరుపయోగంగా ఉండేవని.. తొమ్మిదేండ్ల కాలంలో ఆయా ఖాళీ స్థలాలను ఆహ్లాదకరమైన పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం.. చిన్నారులకు విజ్ఞానాన్ని అందించేలా థీమ్ పార్కులను అభివృద్ధి చేశామన్నారు. కుటుంబమంతా సరదాగా పార్కులలో కాలక్షేపం చేసేలా అభివృద్ధి చేశామన్నారు. గతంలో పార్కులను పలు పేర్లతో పిలిచేవారని.. నేడు అభివృద్ధి చేసిన పార్కులన్నింటికీ మహనీయుల పేర్లను పెట్టడం జరిగిందన్నారు. బతుకమ్మ, మహాత్మాగాంధీ, పి.వి.నర్సింహారావు, కొమురంభీమ్, భగత్‌సింగ్, సరోజినీనాయుడు, విజయరామారావు లాంటి మహనీయుల పేర్లను పెట్టి వారి సేవలను భవిష్యత్ తరాలకు గుర్తుండేలా పనులు చేసినట్లు తెలిపారు. కాలనీ 4, 7వ ఫేజ్‌లలో ఏర్పాటు చేసిన థీమ్ పార్కులు విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. కాలనీ 7వ ఫేజ్‌లోని ఎనర్జీ థీమ్ పార్కులో తెలంగాణ రాష్ట్ర పటం, ప్రత్యేకంగా సోలార్ ప్యానళ్లతో ఏర్పాటు చేసిన పార్కు ఎంతగానో బాగుందన్నారు. కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈలు సాయిప్రసాద్, శ్రీనివాస్, స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఉన్నారు.


బాలాజీనగర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీషాబాబూరావు


అభివృద్ధి చేసిన పార్కులో స్థానికులు, చిన్నారులతో ఎమ్మెల్యే కృష్ణారావు

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి


భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

బాలానగర్, అక్టోబర్ 8 : భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని మల్లికార్జునకాలనీ జలమండలి కార్యాలయం సమీపంలో రూ.30 లక్షల నిధులతో యూజీడీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. డివిజన్లో ఇప్పటికే 95 శాతం అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కర్రె జంగయ్య, ఇర్ఫాన్, హరినాథ్, ఖధీర్, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, జహంగీర్, సోఫీ, అశోక్‌చారీ, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేన్ సాగర్ నాలాలో మృతదేహం లభ్యం

చిక్కడపల్లి,అక్టోబర్ 8 : చిక్కడపల్లి పోలీసులు గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం చేసుకున్నారు. సీఐ పిడమర్తి నరేశ్ తెలిపిన ప్రకారం.. చిక్కడపల్లి హుస్సేన్ సాగర్ బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం మృతదేహం కొట్టుకొచ్చిందని సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాలా నుంచి వెలికి తీశారు. మృతుడి వయస్సు 50ఉండి, 5. 7 అడుగుల ఎత్తున ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసును ఎస్సై నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

కవాడిగూడ, అక్టోబర్ 8: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ నాగరాజురెడ్డి తెలిపిన ప్రకారం.. యూపీకి చెందిన మనోజ్‌కుమార్ సింగ్ (55) పదేండ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బన్సీలాల్‌పేటలోని సీసీ నగర్‌లో ఉంటూ కూలీపని చేస్తున్నాడు. ఆయన భార్య యూపీలోనే ఉంటుంది. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మనోజ్ కుమార్ సింగ్ ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ప్లాస్టిక్ వైరుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

## అల్లాపూర్ డివిజన్‌లో..



ఆడబిడ్డలకు ప్రభుత్వం బతుకమ్మ చీరలను అందజేసి అన్ని వర్గాల పర్వదినాలను సమాన దృష్టితో చూస్తుందని కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల్లో కార్పొరేటర్ మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టలేదని, సీఎం కేసీఆర్ మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పండుగలను సగౌరవంగా జరుపుకునేందుకు చేయూతనందిస్తున్నారని పేర్కొన్నారు.

– అల్లాపూర్,అక్టోబర్8

## మహిళలకు బతుకమ్మ పండుగ కానుక


కూకట్‌పల్లిలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 8 : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు బతుకమ్మ పండుగ కానుకగా చీరలను పంపిణీ చేస్తున్నట్లు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, ఆస్బెస్టాస్ కాలనీలలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అండగా నిలుస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో డీపీవో ఇంద్రసేన, సీవో సుజాత, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, అబ్బులు, ప్రభాకర్ తదితరులున్నారు.

## శంషీగూడ వార్డు కార్యాలయంలో ..

ఆల్విన్ కాలనీ డివిజన్ శంషీగూడ వార్డు కార్యాలయంలో మహిళలకు ప్రభుత్వం తరపున బతుకమ్మ చీరెలను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపడుచులకు పెద్దన్నలా సీఎం కేసీఆర్ నిలుస్తున్నారన్నారు. ప్రతిష్టాత్మక బతుకమ్మ వేడుకలకు చీరసారె అందించి ఆదరిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్‌యని కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, మహిళా నేతలు పాల్గొన్నారు.

– మియాపూర్, అక్టోబర్ 8



## కూకట్‌పల్లి రైతుబజార్‌లో



| కూరగాయ | ధర (కిలో) | కూరగాయ | ధర (కిలో) |
|---|---|---|---|
| టమాట | 11 | ఆలుగడ్డ | 21 |
| వంకాయ | 45 | కీరా | 25 |
| బెండకాయ | 28 | దోసకాయ | 13 |
| పచ్చిమిర్చి | 35 | సోరకాయ | 13 |
| బజ్జి మిర్చి | 40 | పొట్లకాయ(1) | 18 |
| కాకరకాయ | 35 | కందగడ్డ | 40 |
| బీరకాయ | 35 | ఉల్లిపొరక | 65 |
| క్యాబేజి | 18 | ఉల్లిగడ్డ | 29 |
| ఫ్రెంచ్ బీన్స్ | 80 | మామిడికాయ | 10 నుంచి 15 |
| క్యారెట్ | 35 | అరటికాయ | 8 నుంచి 10 |
| కాలీఫ్లవర్ | 18 | చామగడ్డ | 40 |
| దొండ | 28 | ముల్లంగి (1) | 4 నుంచి 6 |
| చిక్కుడు | 70 | మొరంగడ్డ | 33 |
| గోరుచిక్కుడు | 35 | గుమ్మడికాయ | 30 |
| బీట్‌రూట్ | 21 | నిమ్మకాయలు | 30 నుంచి 36 |
| క్యాప్సికం | 55 | మునగకాయ | 5 నుంచి 6 |
| పచ్చి బఠాని | 65 | పుట్టగొడుగులు(200గ్రా) | 40 |
| పొప్పడికాయ | 40 | ఎండుమిర్చి | 280 |
| అల్లం | 160 | వెల్లుల్లి | 200 |

కేపీహెచ్‌బీకాలనీ : ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.